

గ్రీనరీని పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్ రెడ్డి మార్నింగ్ విజిట్‌లో భాగంగా నెహ్రూ పార్క్ నుంచి సెవెన్ రోడ్స్ వరకు ఉన్న గ్రీనరీని పరిశీలించారు. సెవెన్ రోడ్స్ నుంచి వినాయక నగర్ సర్కిల్ మీదగా అలంకాన్‌పల్లి సర్కిల్ వరకు గ్రీనరీని సందర్శించారు. పార్కులో పలు అభివృద్ధి పనులు చేయాలని అధికారులకు ఆదేశించారు. డంపింగ్ యార్డ్‌లో ఉన్న డాగ్ స్టెరైజేషన్ సెంటర్‌ను పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌లో జరుగుతున్న సెగ్రిగేషన్ పనులను తనిఖీ చేశారు. డంపింగ్ యార్డ్ లో ఉన్న తడి చెత్తను, పొడి చెత్తను వేరువేరుగా డంపు చేయాలని అధికారులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న శానిటేషన్, ఇతరత పనులను, వర్షం వల్ల టెంట్ లపై రైన్ ప్రూఫ్ క్లాత్ ని ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు.

ఉచిత బస్సుకు రైట్..రైట్..!

- రేపటి నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం
- జిల్లాలో 470 బస్సులు సిద్ధం
- 84,550 మహిళలకు లబ్ధి
- జిల్లాపై రూ.50 లక్షలు భారం!



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో మహిళలకు ఇచ్చిన హామీ అమలుకు సిద్ధమైంది. స్త్రీశక్తి పథకం పేరుతో మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆర్‌టిసిపై అదనపు ఆర్థిక భారం, మహిళా ప్రయాణికుల సంఖ్య, డ్రైవర్ల, కండక్టర్ల కొరత, రిక్రూట్‌మెంట్ తదితర అంశాలపై ఆర్‌టిసి ఉన్నతాధికారులు మేథోమధనం చేసింది. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఆర్‌టిసి యంత్రాంగం శుక్రవారం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభోత్సవానికి మంత్రులు, ఆయా డిపోల పరిధిలోని ఎమ్మెల్యేలను ఆహ్వానించే పనిలో నిమగ్నమైంది. ఏడాదికాలంగా ఉచిత బస్సు పథకం అమలుపై చర్చలు నడుస్తుండడంతోపాటు అనేక భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కథనం...

జిల్లాలో 616 ఆర్‌టిసి బస్సులు రవాణా సదుపాయాలను అందిస్తున్నాయి. రోజువారీ షెడ్యూల్‌ను పరిశీలిస్తే 546 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. స్త్రీ శక్తి పథకం అమలు పరిస్థితుల నేపథ్యంలో వీటికి అదనంగా మరో 50 అదనపు బస్సులను సిద్ధం చేసింది. కడప, అన్నమయ్య జిల్లా ఆర్‌టిసి ఉన్నతాధికారులు శుక్రవారం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుకు శ్రీకారం చుట్టాయి. స్త్రీశక్తి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాలకు డిపోల వారీగా మంత్రులను, ఎమ్మెల్యేలను ఆహ్వానించడంపై ఆర్‌టిసి యంత్రాంగం కిందుమీదులవుతోంది. పులివెందుల, బద్వేల్ అసెంబ్లీ ప్రాంతాల్లో వైసిపికి చెందిన ప్రజాప్రతినిధులు ఉన్న నేపథ్యంలో ఎవరిని ఆహ్వానించాలనే అంశంపై కలెక్టర్‌తో సంప్రదింపులు చేస్తుండడం గమనార్హం.

470 ఆర్టీసీ బస్సులు సిద్ధం

జిల్లా పరిధిలో ఆరు డిపోలు ఉన్నాయి. వీటిలో కడప డిపో పరిధిలో 75, మైదుకూరులో 52, ప్రొద్దుటూరులో 118, జమ్మలమడుగులో 63, పులివెందులలో 89, బద్వేల్ డిపోలపరిధిలో 55 బస్సులను సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా అన్ని రూట్లకు చెందిన 470 ఎక్స్‌ప్రెస్, ఆల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు కేటగిరీ బస్సులు సిద్ధం చేసింది. 113 ఎక్స్‌ప్రెస్, 59 ఆల్ట్రా పల్లెవెలుగు, 290 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. అదనంగా 30 బస్సులు, 20 స్కూలు బస్సులను సర్వీసు అందించడానికి సిద్ధంగా ఉంచారు.

84,550 మంది మహిళలకు లబ్ధి

జిల్లాలో ప్రతిరోజూ 1.51 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. 60,400 మంది మహిళలు ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. ఉచిత బస్సు ప్రయాణం అమలు నేపథ్యంలో 84,550 మందికి చేరుకునే అవకాశం ఉందని గుర్తించారు. పెరగనున్న ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిరోజూ ఆర్టీసీకి రూ.89 లక్షల ఆదాయం లభిస్తోంది. ఇందులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రూ.35,73,600 నష్టపోయే అవకాశం ఉన్నట్లు అంచనా. ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన అనంతరం 1.4 శాతం మహిళా ప్రయాణికులు పెరిగి రూ.50 లక్షలకు భారం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

డ్రైవర్ల కొరతతో సతమతం

జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం అమలుకు డ్రైవర్ల కొరత ఎదురు కానుంది. జిల్లాలో 769 మంది డ్రైవర్లు, 860 మంది కండక్టర్లు ఉన్నారు. ఉచిత బస్సు ప్రయాణం అమలు నేపథ్యంలో డ్రైవర్ల కొరత భారీగా ఏర్పడనున్నట్లు తెలుస్తోంది. ఆర్‌టిసి ఉన్నతాధికారులు ఆన్‌కాల్ పేరిట 60 మంది పని చేస్తుండగా, మరో 70 మంది అదనపు డ్రైవర్లను రోజువారీ కూలీలుగా శిక్షణ తీసుకుంది. 17 మంది కొన్ని డిపోలకు అందుబాటులోకి రావడం గమనార్హం. వీరితోపాటు మరికొంతమందిని రోజు వారీ కూలి ప్రాతిపదికన డ్రైవర్లుగా తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

15 నుంచే ఉచిత బస్సు ప్రయాణం

ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలోని డిపోల వారీగా డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశాం.

- పి.గోపాల్‌రెడ్డి, ఆర్‌టిసి ఆర్‌ఎం, కడప.

పెన్నా నదికి భారీగా వరద నీరు

38 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం
తగ్గని వర్షాలు.. ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-చెన్నూరు

అనంతపురం హిందూపురం కర్నూలు నంద్యాల కడప జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో పెన్నా, చిత్రావతి, కుందూ నదులకు వరద నీరు పోటెత్తడంతో చెన్నూరు వద్ద పెన్నా నది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుంది. బుధవారం సాయంత్రానికి చెన్నూరు వద్ద 38వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళుతుంది. శ్రీశైలం జలాశయం పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నుంచి వస్తున్న నీరు పూర్తిగా కుందనదికి వదలడం, భారీ వర్షాలు కురవడంతో ఆ నీరంతా కూడా కుందూ నదికి చేరుతున్నది. కుందూ నది నుంచి 31 వేలు క్యూసెక్కుల వరద నీరు పెన్నా నదిపై నిర్మించిన ఆదినిమ్మాయిపల్లి ఆనకట్ట వద్దకు చేరుకుంటుంది. అనంతపురం జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో వరద నీటితో చిత్రావతి పోటెత్తాడంతో గండికోట జలాశయం నుంచి 7500 క్యూసెక్కులు వరద నీటిని మైలవరం జలాశయంకు వదులుతున్నారు. మైలవరం జలాశయం నుంచి వచ్చిన నీటిని పెన్నా నదికి వదులుతుండడంతో పెన్నా నదిపై నిర్మించిన అదినిమ్మాయపల్లి ఆనకట్ట వద్దకు చేరుకుంటున్నాయి. అక్కడ నుంచి చెన్నూరు మీదుగా సోమశిల జలాశయంలోకి వెళ్తుంది. పెన్నా నదిలో నీటి ఉధృతిని ఆధుని మాయపల్లి ఆనకట్ట వద్ద కెసి కెనాల్ అధికారులు చెన్నూరు వద్ద కేంద్ర జల సంఘం సిబ్బంది నీటి ఉధృతిని పరిశీలిస్తున్నారు. చెన్నూరు మండలంలో ఐదు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో చెన్నూరులోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలువ ఉండడంతో ప్రజల ఆందోళన గురవుతున్నారు. బుధవారం 13.6 వర్షపాతం నమోదైనట్లు మండల తహశీల్దార్ సరస్వతి తెలిపారు. పెన్నా నదిలో వరద ప్రవాహం పెరుగుతుండడంతో విఆర్ఒ, విఆర్ఎలకు పెన్నా నదిలో ఎవరిని దిగకుండా చూడాలని ఆదేశించామన్నారు.

ఉధృతంగా కుందూ
- పాఠశాల నుంచి వెనుదిరిగిన విద్యార్థులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అన్నవరం గ్రామం వద్ద కుందూ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 30 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చిన కొంత సమయానికే వెను తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు. వివరాలు..బుధవారం రోజు మాదిరిగానే మడూరుకు చెందిన 30 మంది విద్యార్థులు అన్నవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వచ్చారు. అయితే ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కుందూ నది ఉధృతి క్రమంగా పెరుగుతుండడంతో సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు సమస్యగా ఉంటుందని గ్రహించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ప్రధాన ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులను సురక్షితంగా బ్రిడ్జి దాటించారు. ప్రస్తుతం కుందునదిలో 17 వేల క్యూసెక్కులకు పైగా నీరు ప్రవహిస్తుంది. నీటి ప్రవాహం క్రమేపి పెరుగుతూ బ్రిడ్జి పైకి నీరు వచ్చి చేరుతుంది. ఎగువ ప్రాంతాల్లో బుధవారం రాత్రికి అధిక వర్షాలు పడితే నీరు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.తీర గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రమాకుమారి ఆదేశాలు జారీ చేశారు. బ్రిడ్జి వద్ద సిబ్బందిని అప్రమత్తం చేశారు. విఆర్ఎలను కాపలాగా ఉంచారు.



చాపాడు : విద్యార్థులను బ్రిడ్జి దాటిస్తున్న పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు

విద్యతోపాటు వ్యక్తిత్వం పెంచుకోవాలి
- సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న జడ్జి

విద్యార్థులు విద్యతోపాటు వ్యక్తిత్వం పెంపొందించుకోవాలని సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం కెఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఇండక్షన్ ప్రోగ్రాం 2కె25 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనించాలని తెలిపారు. నీతి, న్యాయం, నిరంతర అభ్యాసం గురించి వివరించారు. కెఎస్ఆర్ ఎం కళాశాల ఎమ్‌డి డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్తగా చర్య విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి. నాగేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలగాలని పేర్కొన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సుభాష్ యాదవ్, అదనపు వైద్య ఆరోగ్య అధికారి రవిబాబు మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో మానసిక, శారీరక ఆరోగ్యం ముఖ్యమని తెలిపారు. కళాశాల యాజమాన్యం అతిధులను ఘనంగా సన్మానించారు. నిర్వాహక కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సఖి సెంటర్ కో-ఆర్డినేటర్ అశ్విని, మహిళా రక్షణ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. రాధ, కల్చరల్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.వీర శంకర్ పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే తప్పుడు ఆరోపణలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : పులివెందులలో స్వేచ్ఛగా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడం చూసి ఓర్వలేక వైసిపి నాయకులు ఎన్నికల కమిషన్, పోలీస్ యంత్రాంగంపై అసత్య ఆరోపణలు చేయడం దారుణమని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ పేర్కొన్నారు. బుధవారం టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికల్లో ఓటర్లెవరూ భయభ్రాంతులకు గురికాలేదన్నారు. బెదిరింపులు లేకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఎన్నికల కమిషనర్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారని వైసిపి నేతలు తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.

వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించండి : రైతు సంఘం

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేసుకుంటున్న విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని రైతు సంఘాలు, కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు కడప నగరం పాలంపల్లి సచివాలయం దగ్గర ఒప్పంద పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వామపక్ష రైతు కౌలు రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు బి.దస్తగిరి రెడ్డి, టక్కోలి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ట్రంప్, మోడీ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. రైతాంగం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల భారత వ్యవసాయ రంగానికి తీవ్ర ప్రమాదం ఏర్పడిందన్నారు. ఈ ఒప్పందాల వల్ల కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూరతాయన్నారు. యంత్రాలు అమ్ముకోవటానికి, వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ చేసుకోవటానికి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడతాయని అన్నారు. 10 సంవత్సరాల నాటి ట్రాక్టర్‌లను రద్దు చేయాలని, వాటి స్థానంలో కొత్త ట్రాక్టర్ లు కొనుగోలు చేయాలని రైతులను ఆదేశించే విధానాలు దుర్మార్గమని విమర్శించారు. వాణిజ్య ఒప్పందాలు వ్యవసాయానికి, రైతులకు వినాశకరంగా ఉండకూడదని హితవు పలికారు. వ్యవసాయన్ని నాశనం చేసి భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలు తగదన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు వల్ల వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మోడీ ప్రభుత్వం దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టేలా బహుళ జాతి సంస్థలకు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు లొంగి వ్యవహరించడం తగదన్నారు. ట్రంపు సుంకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు రుణాలు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కొండయ్య, వీర సుబ్బారెడ్డి, వీరనారాయణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దేవాదాయ శాఖ ఉత్తర్వులు విడుదల చేసిందని ఇఒ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసిలు 20 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా రీ పోలింగ్

- బహిష్కరించిన వైసిపి
- పటిష్టమైన పోలీసు బందోబస్తు
- నేడు ఓట్ల లెక్కింపు
- మధ్యాహ్నానికే ఫలితాలు వెల్లడి

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికలకు మంగళవారం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో కూటమి ప్రభుత్వం, పోలీసులు కుమ్మక్కై, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రానీయకుండా, బయట ప్రాంత వ్యక్తులు వచ్చి ఓట్లు వేశారని కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీ ఫిర్యాదు ఆధారంగా బుధవారం అచ్చవెల్లిలోని మూడో నెంబర్ పోలింగ్ బూతుకు, ఎర్రబల్లె కొత్తపల్లిలోని 14వ నెంబరు పోలింగ్ బూత్‌కు రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ రెండు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు రీ పోలింగ్ నిర్వహించారు. రీపోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. రీ పోలింగ్ సందర్భంగా పోలీసులు పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉప ఎన్నికల రీ పోలింగ్‌లో 58.24 శాతం నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటపతి తెలిపారు. పోలింగ్ నెంబర్ 3, 14 బూతులలో 1765 ఓట్లకు గాను 1028 ఓట్లు పోల్ అయ్యాయి. 3వ కేంద్రంలో 1273 గాను 691 ఓట్లు, 14వ పోలింగ్ బూతులు 492 గాను 337 ఓట్లు పోలయ్యాయి. బ్యాలెట్ బాక్స్‌లను ప్రత్యేక వాహనాల ద్వారా పోలీస్ బందోబస్తుతో కడపకు తరలించారు.



కొత్తపల్లె పోలింగ్ కేంద్రం వద్దకు వర్షంలోనూ చంటి బిడ్డతో ఓటు వేసేందుకు వస్తున్న మహిళ

నేడు ఓట్ల లెక్కింపు

పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానాలకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికలను నిర్వహించింది. ఈ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చేశారు. పులివెందుల జడ్‌పిటిసికి సంబంధించి 10 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒకే రౌండులో పులివెందుల జడ్‌పిటిసి ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానానికి సంబంధించి పది టేబుళ్ల ఏర్పాటు చేశారు. రెండు రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. రెండు స్థానాల ఫలితాలు మధ్యాహ్నానికే వెలువడుతాయన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా పటిష్టమైన బందోబస్తుతో పాటు, అన్ని ఏర్పాట్లను చేశారు. ఓట్ల లెక్కింపు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుంది.



కొత్తపల్లె పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత : కలెక్టర్

కడప అర్బన్ : పటిష్టమైన భద్రతా బలగాల మధ్య కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేశామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. జడ్‌పిటిసి ఉప ఎన్నికలకు సంబంధించి బుధవారం సాయంత్రం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జెసి అదితి సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన బ్యాలెట్ బాక్సులను అత్యంత సురక్షితంగా భద్రపరచామన్నారు. ఓట్ల లెక్కింపు సజావుగా, సౌకర్యవంతంగా జరిగేలా సెటప్ చేశామన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, ఎఆర్‌ఒలు జాన్ ఇర్విన్, రంగస్వామి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డిఎస్‌పి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రీ పోలింగ్ ఒక డ్రామా : ఎంపీ

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

జడ్‌పిటిసి ఉప ఎన్నికల రీ పోలింగ్ ఒక డ్రామా అని, కోర్టును ఆశ్రయిస్తే చెప్పుకోవడానికి రీ పోలింగ్ రెండు బూతులలో పెట్టారని, 15 బూతుల్లో స్లిప్పులు లాక్కుని దొంగ ఓట్లు వేశారని, ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ఎన్నికలు, రీ పోలింగ్‌ను బహిష్కరిస్తున్నామని కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ తేదీ జరిగిన పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికలు ఎలా జరిగాయో రాష్ట్రం మొత్తం చూశారని తెలిపారు. ఇతర నియోజకవర్గాల నుంచి వందలాది మంది టిడిపి వారు ఎలా బూతులు ఆక్రమించారో అందరికీ తెలుసన్నారు. బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కేవలం 2 బూతుల్లో మాత్రమే రీ పోలింగ్ ప్రకటించారని తెలిపారు. మేము స్పష్టంగా 15 బూతుల్లో రీపోలింగ్ జరగాలని, కేంద్ర బలగాలతో ఎన్నిక జరపాలని కోరామని పేర్కొన్నారు. రాత్రికి రాత్రి కేవలం రెండు బూతుల్లో రీ పోలింగ్ అంటున్నారని చెప్పారు. కోర్టును ఆశ్రయిస్తామని ఈ రీ పోలింగ్ డ్రామాను తెర మీదకు తెచ్చారన్నారు. రెండు బూతుల్లో జరుగుతున్న రీ పోలింగ్‌ను బహిష్కరించామన్నారు. గ్రామాల్లోకి వెళ్ళి ప్రజల్ని అడిగితే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.

జగన్‌కు భయం పట్టుకుంది : ఎమ్మెల్సీ

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిలో భయం పుట్టుకొచ్చిందని, ఆచరించి మాట్లాడితే బాగుంటుందని, ఏజెంట్లను కూడా పెట్టుకోలేని పరిస్థితి వైసిపిదని, గతంలో మీరు చేసింది గుర్తుతెచ్చుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. 2004 నుంచి 2009 మధ్యలో జరిగిన ఎన్నికలలో మీరు పులివెందుల నుంచి జమ్మలమడుగు, రాయచోటి, కడప నియోజకవర్గాలకు వెళ్లి చేసిన దౌర్జన్యాలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. 2022లో జరిగిన శాసనమండలి పట్టభద్రుల ఎన్నికలలో లింగాల మండలంలో మా ఏజెంట్లను తీర్చడమే కాకుండా దౌర్జన్యం చేయలేదా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో నామినేషన్లు వేయకుండా ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర మీదన్నారు. సమావేశంలో టిడిపి నాయకుడు బొజ్జ మైసూరారెడ్డి పాల్గొన్నారు.



కడపలో కౌంటింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అరెస్టు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : మండలంలోని నిడిజీవి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని తన స్వగృహంలో బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఎంపీ వై.ఎస్. అవినాష్ రెడ్డిని పోలీసులు పులివెందులలో అరెస్టు చేసి కడపకు తరలిస్తుండగా, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో పాటు , ఆయన వర్గీయులు ఎర్రగుంట్లలో అడ్డుకున్నారు. అవినాష్ రెడ్డిని సుధీర్ రెడ్డి తన స్వగృహానికి తీసుకెళ్లారు. అనంతరం అవినాష్ రెడ్డి ర్యాలీగా ఎర్రగుంట్లకు రావడం, అక్కడి నుంచి తన వాహనంలో పులివెందులకు వెళ్లిపోవడం జరిగింది. ఈ క్రమంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు సుధీర్‌రెడ్డి, ఆయన అనుచరులపై సుమారు 30 మందిపై కేసు నమోదు చేశారు. స్వగృహం వద్ద సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సిఐ నరేష్ బాబు తనకు వ్యక్తిగతంగా ఫోన్ చేశారని తెలిపారు. తనను చంపాలని చూస్తున్నారని విమర్శించారు. కేసులకు తాను భయపడనని న్యాయపోరాటం చేస్తానని అన్నారు. క్రమంలో సుధీర్ రెడ్డి సాయంత్రం ఇంటి వద్ద ఉండగా సిఐ నరేష్ బాబు ఆధ్వర్యంలో, స్పెషల్ ఫోర్స్ పోలీసులు వచ్చి అరెస్టు చేశారు. ఆయన్ను పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మాదకద్రవ్యాల వాడకాన్ని నియంత్రించాలి

ప్రజాశక్తి - కడప

మాదకద్రవ్యాల వాడకం తీవ్రమైన సామాజిక, మానసిక, శారీరక సమస్యలకు దారితీస్తుందని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాలలో నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు గుట్కా, సిగరెట్, తంబాకు, గాంజా వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈకల్ క్లబ్ కో-ఆర్డినేటర్లు కెప్టెన్ డాక్టర్ నీలయ్య, డాక్టర్ సావిత్రి మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక అని, వారి విలువైన జీవితాన్ని మాదక ద్రవ్యాలతో నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులలో ఆరోగ్యకరమైన, మాదకద్రవ్య రహిత జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ మహేష్, ఎన్.ఎస్.ఎస్ అధికారులు నాగరాజు, ఎన్‌సిసి క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రమాణం చేయిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

వివేకా హత్య కేసులో
నిందితులను బెదిరించడంపై విచారణ

ప్రజాశక్తి - కడప : కడప సెంట్రల్ జైలులో వై.ఎస్.వివేకానంద హత్య కేసు నిందితులను బెదిరించిన ఘటనపై విచారణ షురూ అయింది. బెదిరింపుల ఘటనపై లోతైన దర్యాప్తు దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జైలులో దస్తగిరిని శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి బెదిరించినట్టు సమాచారం. అనుకూలంగా సాక్ష్యం చెప్పాలని బెదిరించినట్లు అభియోగాలు నమోదయ్యాయి. రూ.20 కోట్లు ఎర చూపినట్లు, లేదా చంపుతామని భయపెట్టినట్లు తెలిసింది. జైలులో వైద్యశిబిరం నిర్వహించి ఖైదీలను బెదిరించినట్లు కూడా సమాచారం. దీంతో నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తూ ఎపి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

కర్నూలు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అధ్యక్షతన దర్యాప్తు కమిటీ నియామించారు. దర్యాప్తు కమిటీ సభ్యులుగా కడప డిఎంహెచ్ఒ కె. నాగరాజు, జైళ్ల సూపరింటెండెంట్ మహమ్మద్ ఇర్ఫాన్, కడప ఆర్‌డీవో జాన్ ఇర్విన్‌ను నియమించారు. ఘటనపై దర్యాప్తు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని గతేడాది సెప్టెంబరులో వివేకా కుమార్తె సునీత కోరిన విషయం తెలిసిందే.అప్పట్లో రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ రాహుల్ నేతృత్వంలో ఇప్పటికే దర్యాప్తు ప్రారంభమైంది. ఆయన లోపాలు తెలుపుతూ అందుకు బాధ్యులుగా ముగ్గురిని గుర్తించారు. నివేదిక మేరకు అప్పటి జైలు అధికారులు ప్రకాష్, జవహర్ బాబుపై చర్యలు తీసుకున్నారు. డిప్యూటీ సివిల్ సర్జన్ పుష్పలతను బాధ్యురాలిగా చేస్తూ ఇప్పటికే నోటీసులు కూడా అందజేశారు. వైద్య, పోలీసు, ఇతర విభాగాల ప్రమేయం తేలడంతో తదుపరి విచారణకు కమిటీ లోతుగా దర్యాప్తు చేసి వెంటనే హోంశాఖకు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

అవగాహన పెంచుకోవాలి : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్ : మండల విద్యా శాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు విద్యా సంబంధిత అంశాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని విద్యాశాఖాధికారి షంషుద్దీన్ సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా సంబంధిత అంశాలపై సంపూర్ణ అవగాహన పొందాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ స్ సమావేశ భవనంలో జిల్లా స్థాయిలో హ్యూమన్ క్యాపిటల్ వికసిత్ భారత్‌లో భాగంగా స్కూలింగ్, బిల్డింగ్ పై ఒక్క రోజు వర్క్ షాపును సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో- ఆర్డినేటర్ నిత్యానందరాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ జిల్లా స్థాయి వర్క్ షాపును సద్వినియోగం చేయాలన్నారు. ఇందులో చర్చించిన విషయాలను రాష్ట్ర స్థాయికి పంపుతామని తెలిపారు. ఎపిసి మాట్లాడుతూ ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు విలువైన సలహాలు ఇస్తే రాష్ట్ర స్థాయి అధికారులకు పంపుతామని చెప్పారు. ఎంఇఒలను, ప్రధానోపాధ్యాయులను ఐదు గ్రూప్‌లుగా విభజించి చర్చించి వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల్లో ఉద్యోగోన్నతులు చాలా మందికి ఒక్కసారి కూడా లేకపోవడం బాధాకరమన్నారు. డిప్యూటీ ఇఒ రాజగోపాల్‌రెడ్డి వర్క్ షాపు ప్రాధాన్యతను వివరించారు. విద్యా శాఖలో చాలా మార్పులు వచ్చాయని తెలిపారు. గ్రూప్ లీడర్లు మాట్లాడుతూ గ్రూప్ సభ్యులతో చర్చించిన అంశాలను వివరించారు. సమావేశంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ సరస్వతి, జిల్లా వైద్య శాఖ అధికారి వెంకట చంద్ర రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేష్‌రెడ్డి

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నియోజకవర్గంలోని 132 మంది బాధితులకు రూ. 1.10 కోట్లు విలువ చేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పంపిణీ చేశారు. బుధవారం మండల పరిధిలోని దేవగుడి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వీలైనంత త్వరగా, పూర్తి మొత్తంలో వచ్చేలాగా కృషి చేస్తున్నామన్నారు. బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఆయన సతీమణి అరుణమ్మ హార్ ఘర్ తిరంగాలో భాగంగా ఆయన ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు.

యుసిఐఎల్‌లో హిందీ భాషా ప్రోత్సాహంపై శిక్షణ

ప్రజాశక్తి - వేముల

వేముల మండలంలోని స్థానిక తుమ్మల పల్లె యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో అణు శక్తి విభాగం 70వ ప్లాటినం జూబిలీ ఉత్సవాల సందర్భంగా బుధవారం హిందీ భాషా నైపుణ్య అభివృద్ధి శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ డైరెక్టర్ సంతోష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హిందీ భాషా ప్రోత్సాహం, సాంకేతిక రంగంలో వినియోగం, ప్రభుత్వ పనుల్లో సమర్థవంతమైన అమలుపై విస్తృతమైన ఉపన్యాసాన్ని వివరించారు. విశాలమైన అనుభవం జ్ఞానాన్ని ఉపయోగించి హిందీ టైపింగ్, షార్ట్‌హ్యాండ్, కంప్యూటర్‌లో హిందీ పని, ఆధునిక పరిపాలనా సందర్భాలలో హిందీ వినియోగం పై ప్రాయోగిక సమాచారాన్ని వివరించారు. అనంతరం సుమన్ సర్కార్, జనరల్ మేనేజర్ (మిల్), కిశోర్ భగత్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (మైన్స్) ప్రధాన అతిథిని శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో బదావత్ శ్రీను, హిమాన్షు తివారి, మురళీధర్, వాసుదేవ్‌రెడ్డి, జి.ఎన్.దాస్, మోహన్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, భద్రదాస్, ఎస్.ఎస్.గుప్తా, ఎస్.కె. శర్మ, మేత్యానంద్, జయ్ సింహరెడ్డి, నీలావతి, సురేష్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగులోకి బ్రిటిష్ కాలంనాటి నాణేలు

ప్రజాశక్తి - చాపాడు



మైదుకూరు మున్సిపాలిటీలోని శెట్టి వారి పల్లె గ్రామంలో బ్రిటిష్ కాలం నాటి నాణేలు వెలుగులోకి వచ్చాయని చరిత్ర కారుడు బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. కొన్ని మాసాల కిందట శెట్టి వారిపల్లి గ్రామంలో గ్రామ దేవత పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట ,నూతన దేవాలయం కట్టించారున్నారు. అప్పుడు ఈ పోలేరమ్మ విగ్రహం కింద స్వాతంత్ర్యానికి ముందు (బ్రిటిష్ కాలం నాటి) 1911 నుంచి 1945 వరకు ఉన్న నాణేలు ఉన్నాయని తెలిపారు. కాపర్, సిల్వర్ తో తయారుచేసిన ఆనాటి కాలంలోని క్వార్టర్ అణా, ఒక్క అణా, వన్ పైస్ లభ్యమైనట్లు తెలిపారు. ఒక పైసా నాణేనికి మధ్యలో రంధ్రం ఉందన్నారు. శెట్టి వారి పల్లి గ్రామంలో మొట్టమొదటగా పోలేరమ్మ తల్లి విగ్రహం కొద్దిగా చిద్రమవ్వటంతో ఊరి పెద్దలు నూతన విగ్రహాన్ని ప్రతిష్ట చేశారని వివరించారు. ఈ నాణేల గురించి శెట్టి వారి పల్లె గ్రామానికి చెందిన కొప్పర్తి మహేశ్వర్ రెడ్డి, కొప్పర్తి కిరణ్ కుమార్ రెడ్డి, దంత వైద్యులు కొప్పర్తి కెఎన్ఆర్‌లు సమాచారం ఇచ్చారని తెలిపారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి

చీనీ, అరటి పంటల్లో మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి - వేముల

చీనీ, అరటి పంటల్లో మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జి.పి. ఓబులేసు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక వేల్పుల, బెస్తవారిపల్లె గ్రామ పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎక్కువ భాగంలో చీని, అరటి పంటల సాగులో ఉన్నప్పటికీ చీనిలో ప్రధానంగా సమస్య సూక్ష్మధాత లోపాలు ఉన్నట్టు గుర్తించారు. బత్తాయిలో ఇనపదాత లోపం సవరణకు ఫెర్రస్ సల్ఫేట్ అన్నభేది 20 గ్రాములు, నిమ్మ ఉప్పు రెండు గ్రాములు నీటిలో కలిపి ఏడు రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్ ,విహెచ్ఎ ప్రసన్న ,రైతులు,ఏపీ సీఎం అఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-చక్రాయపేట

మండలంలోని కుప్పం గ్రామ పంచాయతీ బురుజుపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం ఘనంగా సన్మానం చేశారు. పాఠశాలలో పనిచేస్తూ మే 31న ఉద్యోగ విరమణ పొందిన కృష్ణం రామకృష్ణారెడ్డికి, ఇటీవల బదిలీపై వెళ్లిన జడ శ్రీనివాసులు, ఉమ్మడిశెట్టి వెంకటసుబ్బయ్యకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి, మెమొంటో, పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సేవలు ఆదర్శనీయమని, విద్యార్థుల అభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ రాబోయే కాలంలోనూ తాము మేము సమాజ హితం, విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేస్తామని చెప్పారు. పాఠశాల కమిటీ చైర్మ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు ఎనలేని కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు ఎరుకల రెడ్డి, జిల్లా నాయకులు భాస్కర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు భోగేశ్వరయ్య, మల్లేశ్వరయ్య, శ్రీనివాసులు విశ్రాంతి ఉపాధ్యాయుడు రాధాకృష్ణయ్య ,వివిధ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

వర్షం నీరు పోయేదెలా.?

అవస్థల్లో వాహనదారులు
సిమెంట్ రోడ్డు వేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పట్టణం, మోరగుడి గ్రామాన్ని కలిపే మూడు రోడ్డు కూడలి వద్ద చిన్నపాటి వర్షానికైనా మడుగు కావాల్సిందే. వర్షం వస్తే నీరు పోయేదెలా అని ప్రజలు, ప్రయాణికులు, వాహన దారులు ప్రశ్నిస్తున్నారు. వర్షం నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడింది. ఈ రోడ్డు మార్గం నుంచే పెద్దముడియం, ఆళ్లగడ్డ, కోయిలకుంట్ల, కర్నూల్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. పైగా మాజీ ఎమ్మెల్యే కుండా రామయ్య విగ్రహం ఎడమ భాగంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు చిన్నపాటి కుంటలా దర్శనం ఇస్తుంది. అక్కడక్కడా గుంతలు కూడా ఉన్నాయి. ద్విచక్ర వాహన దారులు పలు మార్లు కిందపడిన ఘటనలు చోటు చేసుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, టిడిపి ఇంఛార్జి భూపేష్ రెడ్డి, అధికారులు, స్పందించి నీరు నిలబడకుండా రోడ్డు వేయాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

సిమెంట్ రోడ్డు వేయాలి

మూడు రోడ్ల కూడలిలో వర్షం వస్తే గందరగోళం గా ఉంటుంది. వాహనదారులు కిందపడుతున్నారు. నీరు వున్నప్పుడు తెలియక వాహనదారులు వేగంగా వెళ్లినప్పుడు లోపల ఉన్న గుంతలలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డు వేసి నీరు నిల్వకుండా చూడాలి. ప్రమాదాలు జరగకుండా చూడాలి.

- వి. శివ కుమార్,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సహకార సంఘం నూతన కార్యవర్గం నియామకం

ప్రజాశక్తి - ముద్దనూరు



చైర్మన్‌రాజుల సురేంద్రనాథ్‌రెడ్డి, డైరెక్టర్ చింతా మురళి

ముద్దనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు సంఘం చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. చైర్మన్‌గా రాజుల సురేంద్రనాథ్‌రెడ్డి (రాజుల గురువాయపల్లె), డైరెక్టర్లుగా చింతా మురళీ (కొసినేపల్లె,) ఉత్తమారెడ్డి (దేనేపల్లె)నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సహకార బ్యాంకు సిఇఒ రత్నం తెలిపారు. బుధవారం మండల నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి చేతుల మీదుగా సురేంద్రనాథ్ రెడ్డి, మురళీకి బ్యాంకు సిఇఒ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం చైర్మన్ రాజుల సురేంద్రనాద్ రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు ద్వారా రైతులకు సకాలంలో రుణాలు అందించేందుకు రైతుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కూటమి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, మండల నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి సహాయ సహకారాలతో చైర్మన్ పదవి లభించిందన్నారు. చైర్మన్, డైరెక్టర్ పదవి రావడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే, భూపేష్ రెడ్డి, డాక్టర్ మధుసూదనరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీ చైర్మన్‌గా మురుకూటి చిన్న గురివిరెడ్డి

ప్రజాశక్తి-కాశినాయన

నరసాపురం సొసైటీ చైర్మన్‌గా బుధవారం మురుకూటి చిన్న గురివిరెడ్డి బాధ్యత స్వీకరించారని ఆ సొసైటీ సిఇఒ వెంకటేశ్వర్లు తెలిపారు ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ చిన్నగురివి రెడ్డి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. రైతుల, సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నరసాపురం సర్పంచ్ ఖాజావలి టిడిపి నాయకులు కృష్ణయ్య అక్కి రమణారెడ్డి రోహిత్ రెడ్డి హుస్సేన్ పీరా సొసైటీ బ్యాంకు సిబ్బందిటిడిపి నాయకులు పాల్గొన్నారు



బాధ్యతలు స్వీకరిస్తున్న చిన్న గురివిరెడ్డి



చాపాడు : బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహారెడ్డి

అల్లాడుపల్లి సొసైటీ కమిటీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం సొసైటీ బ్యాంకు చైర్మన్ మార్తల నరసింహారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్ డివిజనల్ కో- ఆపరేటివ్ అధికారి, పర్సన్ ఇన్‌ఛార్జి బ్రహ్మానంద రెడ్డి చేతుల మీదుగా బాధ్యతలు అప్పగించారు. సభ్యులు మేకల సుదర్శన్ బాబు, గోసుల చిన్న వీరయ్య గారి వీరారెడ్డి నియామక పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో అన్ని విధాల అభివృద్ధి పరుస్తామన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి ఉండేలా చూస్తామన్నారు. త్వరలో ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎ.పి రవీంద్ర, సొసైటీ సిఇఒ జాన్, సిబ్బంది రంగా పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి వల్లూరు : ప్రస్తుతం ఎక్కువ వర్షాలు కురుస్తుండడంతో వల్లూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మురుగునీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వల్లూరు ఎంపిడిఒ శ్రీధర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు సరిగ్గా కాలువల ద్వారా పోవడంతోపాటు బురద, చెత్త నీటి నిలువలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడూ బ్లీచింగ్ పౌడర్ చల్లడం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షం పడడంతో దోమల వల్ల వచ్చే వ్యాధులు నీటి ద్వారా వ్యాప్తి చెందే రోగాల ముప్పు ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. **ఎర్రగుంట్ల:** ఇటీవల కురుస్తున్న అధిక వర్షాల కారణంగా వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడిఒ వెంకటరమణయ్య పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఎంపీడీవో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య పరిస్థితులను సమీక్షించి డ్రెయినేజీ వ్యవస్థను శుభ్రం చేయించడం చేయాలని పేర్కొన్నారు. గ్రామాలలో అన్ని నీటి ట్యాంకులు శుభ్రపరిచి ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు ప్రబలడం వలన డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల వస్తాయని వాటి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మురుగు నీరు నిల్వ ఉంచకుండా అవగాహన కల్పించాలని అన్నారు.

రైతులతో పిఎండిఎస్ వేయించాలి : డిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : శనగ పంటను సాగు చేసే రైతులతో పిఎండిఎస్ వేయించాలని ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు డిపిఎం ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ముద్దనూరు రోడ్డులో ఉన్న వరప్రసాద్ పొలంలోని డ్రాగన్ ఫ్రూట్స్ పంట, తేనేటీగల పెంపకం పరిశీలించారు. వరప్రసాద్‌తో డిపిఎం పెట్టుబడి ఆదాయ వివరాలు గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో రసాయన వ్యవసాయం చేసే రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మరలించాలన్నారు. డ్రాగన్ ఫ్రూట్స్ పొలాన్ని సందర్శించారు. మండలంలో శనగ పంట రైతులకు అందరికీ 30 రకాల విత్తనాలతో పిఎండిస్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ నరసింహా రెడ్డి, మాస్టర్ ట్రైనర్ శ్యామ్ సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

'రాచమల్లు' బహిరంగ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పోలీసులకు, పోస్టల్ శాఖకు బహిరంగ క్షమాపణ చెప్పాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్‌బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందల జడ్‌పిటిసి ఉప ఎన్నికల నేపథ్యంలో పోలీసుల వైఖరిని నిరసిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. అంతటితో ఆగకుండా రానున్న రోజులలో తిరిగి వైసిపి అధికారంలోకి వస్తే పోలీసులను అవే దుస్తులతో పోస్టుమేన్‌లుగా విధులు నిర్వహించవలసి వస్తుందని అనుచిత వ్యాఖ్యలు చేయడం పోస్టల్ శాఖను అవమానించే విధంగా ఉన్నాయని అభ్యంతరం తెలియజేశారు. వృత్తి రిత్యా ఎందులోనూ తక్కువ కాదని గుర్తు చేస్తూ పోస్ట్ మాన్‌లకు మాజీ ఎమ్మెల్యే రాజమల్లు క్షమాపణ చెప్పాలన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి - ముద్దనూరు : ప్రతి గర్భిణి, శిశువుకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ సూచించారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తిమ్మాపురం, నల్లబల్లె గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాలు, స్టాక్ రిజిస్టర్లు, మాతా శిశు సంరక్షణ కార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని ప్రతి గ్రామంలో బుధ, శనివారం రోజుల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎఎన్ఎమ్‌లకు సూచించారు. సిహెచ్ఒ ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఇమ్యునైజేషన్ జరిగే ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అవసరమైన వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిడ్డ పుట్టిన వెంటనే మాతా శిశుసంరక్షణ కార్డులో శిశువు పూర్తి సమాచారం నమోదు చేయాలని జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, వ్యాధి నిరోధక టీకాల భాధ్యులు మునిరెడ్డి సిబ్బందికి సూచించారు.ఎ్వాధి నిరోధక టీకాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి కరిష్మా ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్ వైజర్ రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మసిస్ట్ జగదీష్, మలేరియా హెల్త్ అసిస్టెంట్ జయాకర్, సిబ్బంది విజయకుమారి, పద్మావతి, ఇందిరమ్మ పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రాలు.. గ్రంథాలయాలు

ప్రజాశక్తి - వేంపల్లె : గ్రంథాలయాలు పుస్తకాల బాండాగారములుగా మాత్రమే కాకుండా చదవడానికి, పరిశోధనకు, ఆలోచనలకు ప్రేరణ కలిగించే విద్యా కేంద్రాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ పితామహుడుగా పేరు గాంచిన డాక్టర్ సీయాలి రామామృత రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని గ్రంథాలయ శాఖ అధిపతి మాధవరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రంలోని తంజావూరు సమీపంలో జన్మించిన రంగనాథన్ భారతదేశంలో ఆధునిక గ్రంథాలయాల నిర్మాణానికి నిరంతర కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ రంగనాథన్ ఒకవైపు స్వతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంతో పాటు ప్రజలకు జ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయ స్థాపనకు కృషి చేశారని తెలిపారు. ఆయన కృషి వల్లే నేడు లక్షలాది గ్రంథాలయాలు ఆవిర్భవించి కోట్లాదిమంది ప్రజలను విద్యావంతులుగాను, అక్షరాస్యులుగాను, జ్ఞానవంతులుగా, పరిశోధకులుగా మారినట్లు చెప్పారు. కార్యక్రమంలో చరిత్ర శాఖాధిపతి డాక్టర్ బాలకొండ గంగాధర్, తెలుగు శాఖధిపతి డాక్టర్ నాగలక్ష్మి దేవి, వాణిజ్య శాఖ అధిపతి డాక్టర్ మల్లేశ్వరమ్మ, కంప్యూటర్ శాఖ అధ్యాపకుడు షఫీ ఉద్దీన్, కేశమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : ఎపిఎస్ ఆర్‌టిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మాజీ డిపో సెక్రెటరీ భాను ప్రసాద్ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ రెండు రోజుల ధర్నాకు ఇచ్చిన పిలుపుమేరకు ప్రొద్దుటూరు డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో బుధవారం గ్యారేజీ గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు తక్షణమే పిఆర్‌సి కమిషన్ను ఏర్పాటు చేయాలని గవర్నర్‌పేట -2 డిపోను లులు ప్రయివేట్ సంస్థకు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలన్నారు. వేతన సవరణ అయిపోయి ఇప్పటికే రెండు సంవత్సరాలు పూర్తయినందున వెంటనే ఐఆర్ ప్రకటించారన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీలర్‌ను తక్షణమే చెల్లించాలని కోరారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంటట్ చెల్లింపులు తక్షణమే చేయాలని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఎనిమిది వేల పోస్టులను డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని తెలిపారు. ఇహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఎలక్ట్రానిక్ బస్సులను స్వయంగా ప్రభుత్వం కొనుగోలు చేయాలని తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులను కేటాయించాలని చెప్పారు



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

కార్పొరేషన్ రుణాలు మంజూరు ఎప్పుడు?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు నిరుద్యోగులకు ఎప్పుడూ ఇస్తారని డివైఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ప్రశ్నించారు. బుధవారం పొద్దుటూరులోని తహశీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహశీల్దార్ అజయ్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని అన్నారు. ఎస్‌సి, బిసి,మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా ఎన్నికల ప్రచారంలో యువతకు రుణాలు మంజూరు చేస్తామని గత ప్రభుత్వం లాగా కార్పొరేషన్‌లు ఖాళీగా ఉంచమని నిధులు కేటాయించి కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇంతవరకు రుణాలు మంజూరులో జాప్యం చేస్తున్నారని చెప్పారు. పేరుకే కార్పొరేషన్లు ఉన్నాయని నిధులు మాత్రం సున్నా అన్నారు. నిరుద్యోగుల ద్వారా దరఖాస్తులు స్వీకరించి, బ్యాంకుల ద్వారా ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేశారని, కానీ అర్హుల జాబితా ఇంత వరకు విడుదల చేయలేదని వాపోయారు. కార్పొరేషన్ నిధులను పక్క సంక్షేమ కార్యక్రమాలకు వాడడం ద్వారా కార్పొరేషన్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దీని ద్వారా నిరుద్యోగులకు మొండి చేయి చూపించడమే అన్నారు. స్వయం ఉపాధి ద్వారా సబ్సిడి కింద రుణాలు వస్తే వ్యాపారాలు చేసుకోవాలని ఆశగా ఎదురు చూస్తున్న యువతకు నిరాశే మిగులుతుందని పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు రుణాలు మంజూరు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం : వైసిపి

ప్రజాశక్తి - కడప

పులివెందల జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో టిడిపి నాయకులు సాక్షాత్తు కలెక్టర్ సమక్షంలోనే దొంగ ఓట్లు వేసుకున్నారని, ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యం అపహాస్యం చేసినట్లుగా స్పష్టమవుతోందని వైసిపి పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా పేర్కొన్నారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికలు చూస్తే ప్రజాస్వామ్యం ఖూనీ అయినట్లు కనిపిస్తుందన్నారు. దేశ చరిత్రలో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడు చూడలేదు అని వారన్నారు. టిడిపి నాయకులు దౌర్జన్యాలు, రౌడీయిజాన్ని ప్రజలు ఈ ఉపఎన్నికల్లో చూశారన్నారు. ఓటు వేసేందుకు వస్తున్న ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని వాపోయారు. మంత్రి హోదాలో ఉన్న నాయకులే దగ్గరుండి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని విమర్శించారు. ఈ ఎన్నికలు వైసిపికి, డిఐజికి మధ్య జరిగినట్లుగా ఉందని పేర్కొన్నారు. జడ్‌పిటిసి ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఉప ఎన్నికలను రద్దుచేసి కేంద్ర బలగాలతో తిరిగి ఎన్నికలను నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. **కమలాపురం టౌన్ :** పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికలు కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా నిర్వహించిందని వైసిపి నాయకులు నరేన్ రామాంజులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే దమ్ము ధైర్యం లేక ప్రజలను భయభ్రాంతులను గురి చేసి రిగ్గింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. పులివెందులలో ఓటింగ్ జరుగుతుంటే కమలాపురం ఓటర్లకు అక్కడ ఏం పని అని ప్రశ్నించారు. అధికార మదంతో కూటమి నాయకులు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. **వేంపల్లె :**ప్రజాస్వామ్యం బద్ధంగా నిర్వహించాల్సిన జడ్‌పిటిసి ఉప ఎన్నికలు ప్రజాస్వామ్యం అపహాస్యం జరిగేలాగా పోలీసు అధికారులు నిర్వహించారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరించారని మండిపడ్డారు. స్వతంత్ర అభ్యర్థి సైదాపురం సురేష్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రాము, హేమాద్రిపై టిడిపి పార్టీకి చెందిన కొంతమంది దాడులు చేశారని చెప్పారు. కార్లపై పెట్రోల్ పోసి చంపాలని అనుకున్నారని తెలిపారు. దాడులు చేసిన వారిపై కేసులు పెట్టకుండా తమ పార్టీకి చెందిన వారిపైనే పోలీసులు కేసులు పెట్టడం చాలా దౌర్భాగ్యం అన్నారు. ఈ సంఘటనకు సంబంధించి డిఐజి వెటకారంగా మాట్లాడారని చెప్పారు. రెండు జడ్‌పిటిసి ఎన్నికల్లో ఒక ఫాల్స్ అన్నారు. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉండేలాగా పోలీసులు వ్యవహరించాలని సూచించారు.

ప్రభుత్వ ఆలోచన విరమించుకోవాలి

ప్రజాశక్తి - బద్వేలు

నియోజవర్గాలను అభివృద్ధి చేయడం మాని, అక్కడ కలుపుతాం, ఇక్కడ కలుపుతామని ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం కూటమి ప్రభుత్వానికి తగదని ప్రజాసంఘాల నాయకులు కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. బుధవారం ఎ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బండి జకరయ్య, డిహెచ్‌పిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగె వెంకటరమణ, పార్స్ రాష్ట్ర అధికార ప్రతినిధి పిచ్చయ్య, దళిత సీనియర్ నాయకులు కేశవయ్య, మాల మహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గం అన్నమయ్య జిల్లాలో కలిపే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెప్పారు. బద్వేల్ నియోజకవర్గం చైతన్యవంతమైందని ఈ కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి కోసం కార్యాచరణ చేయాలి తప్ప ప్రజలను ఇబ్బందులకు గురి చేసే ఆలోచన మంచి పద్ధతి కాదని హితవు పలికారు. నియోజవర్గంలో పనులు లేక అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉందని దీని అభివృద్ధికి కార్యాచరణ చేయాలి తప్ప నియోజకవర్గాన్ని మారుస్తామని అనడం కూటమి ప్రభుత్వానికి తగదని వారన్నారు. నియోజవర్గాన్ని మార్చి ఆలోచనను ఆపుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారన్నారు. కార్యక్ర మంలో ఎంఆర్ పిఎస్ జిల్లా అధ్యక్షుడు శికామణి, దళిత నాయ కులు ఒ.ఎస్ .విప్రసాద్, ఎన్ ప్రసాద్ నడిబయ్య పాల్గొన్నారు.

రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో

O.S.No. 696/2023 & I.A.No.411/2023
O.S.No.696/2023

కె.రామక్రిష్ణారెడ్డి. ...వాది/పిటిషనర్

Vs

ఎన్. వెంకటశివయ్య. ...ప్రతివాది/రెస్పాండెంట్

పై దావాలో ప్రతివాదికి పత్రికా ముఖముగా సమను : I.A.No.411/2023 నకు నోటీసు

To,
నంద్యాల వెంకట శివయ్య, S/o N. వెంకటసుబ్బన్న, శివాల పల్లె (గ్రా), చెన్నూరు మం॥, వైఎస్ఆర్ కడప జిల్లా.

అను మీరు ప్రతివాదిగా, స్పెసిఫిక్ ఫర్ఫార్మెన్స్ ఆఫ్ అగ్రిమెంట్ దావాను సలుపగా సదరు దావాలో మీ యొక్క హాజరుకు గాను వాయిదా 23.09.2025వ తేదీకి వున్నది. కావున సదరు 23.09.2025వ తేదీ ఉ.గం.10.30 ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై మీకు పై దావాలో ఏవైనా ఆక్షేపణలు/ అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపుకోనంతట పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.

సదరు దావాలో వాది/ పిటిషనర్‌గా I.A.No.411/2023 రుగా టెంపరరీ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ పిటీషన్ సలుపగా, సదరు I.A.లో మీ యొక్క హాజరుకు గాను వాయిదా 23.09.2025వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు I.A.లో మీకు ఏవైనా ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపుకోనంతట, పై I.A.ని మీ పరోక్షముగా తీర్మాణించెదరు.

తేది: 14.08.2025

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

ఎమ్. సుధాకర్ బాబ్జీ
వకీలు, కడప.

రాజశ్రీ IIIవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో

O.S.No. 722/2024 & I.A.No.1001/2024
O.S.No.722/2024

1.కానాల మనోహర్ రెడ్డి
2. శ్రీమతి కె.గంగమ్మ. ...వాదులు/పిటిషనర్లు

Vs

1. పి.రవీంద్రా రెడ్డి & 3 ఇతరులు. ...ప్రతివాదులు/రెస్పాండెంట్లు

పై దావాలో మొదటి ప్రతివాదికి పత్రికా ముఖముగా సమను & I.A.No.1001/2024లో R1కు పత్రికాముఖముగా నోటీసు

To,
D1. పామూరు రవీంద్రారెడ్డి, వయస్సు సుమారు 51 సం॥లు, హిందూ, నందిమండలం (గ్రా & పోస్టు), పెండ్లిమర్రి (మం), వైఎస్ఆర్ కడప జిల్లా.

అను మీరు మొదటి ప్రతివాదిగా మరియు ఇతరుల మీద దావా దాఖలా రెండు ఐటమ్‌ల మీద పర్మనెంట్ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ దావా సలుపగా, సదరు దావాలో మీ యొక్క హాజరుకు గాను 25.08.2025వ తేదీకి వాయిదా వున్నది.కావున సదరు 25.08.2025వ తేదీ ఉ.గం.10.30 ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై పై దావాలో మీకు ఏవైనా ఆక్షేపణలు/ అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపుకోనంతట, పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.

సదరు దావాలో పిటిషనర్ I.A.No.1001/2024 రుగా Ex-Parte టెంపరరీ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ పిటీషన్ సలుపగా, సదరు I.A.లో కూడా మీ యొక్క హాజరుకు/ ఆక్షేపణలకు గాను వాయిదా 25.08.2025వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు తేదిన ఉ.గం.10.30 ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై తెలుపుకోనంతట, పైI.A.ని మీ పరోక్షముగా తీర్మాణించెదరు.

తేది: 14.08.2025

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

ఎమ్. సుధాకర్ బాబ్జీ
వకీలు, కడప.